

# అవిటితనం

విజయవాడకు ట్రాన్స్‌ఫర్ అయిన కొత్త రోజుల్లో ఒక రోజు వారుండే ఇంటిపై వీధికి దూరంగా గల వేరొక్క వీధిలోని చిల్డ్రన్ పార్క్‌కు వెళ్లి వస్తూట దారిలో ఆకస్మాత్తుగా కుడివైపు చూసిన అతని దృష్టి— కిటికీలో నుండి చూస్తున్న పదహారేళ్ల అమ్మాయి కళ్లపై పడింది.

వర్ణనాతీతం అయిన ఆమె సౌందర్యం అతడిని ఎంతో ఆకర్షించాయి.

ఇక ఒక క్షణం కూడా అతడు ఆలస్యం చేయకుండా, ఆమెను ఎలాగయినా ప్రేమించాలి మరియు ఆమె చేత ప్రేమించబడాలి అని, ఇంకా ఆమెను తన జీవిత భాగస్వామిగా చేసుకోవాలని. నిశ్చయంతో ఆ రోజు మొదలుకొని ప్రతిరోజూ అదే సమయానికి వచ్చి, ఆదే స్థలంలో పిల్లల ఆటను చూస్తున్న వాడిలా నటిస్తూ, ఎప్పుడూ కిటికీ వైపునే చూస్తూ, ఆమె వచ్చి కిటికీ నుండి చూడగానే ఆమెను చూసి ఇతడు చిరునవ్వు నవ్వుతూ, అక్కడి పిల్లలను ఏదో మాటలతో నవ్విస్తూ, ఆమెను ఆకర్షించుటకు ప్రయత్నించసాగాడు. అయితే ఈ ప్రయత్నంలో భాగంగా ఆమె పేరు 'సౌందర్య' అని, అది ఆమె అందానికి తగిన పేరు అని అనుకొని, ఇక ఆమెను గూర్చి మిగతా వివరాలు తెల్సుకోవడానికి ప్రయత్నాలు చేయకుండానే, ఆమెను తన సొంతం చేసుకొనుటకు పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాడు.

ఇలా కొద్ది రోజుల తర్వాత ఇతడి చేష్టలకు ఆమె కూడా స్పందించటం ప్రారంభమైంది. దీనితో ఆమె యొక్క ఆ స్పందన ఒక 'గ్రీన్ సిగ్నల్'గా భావించి ఉత్తరం రాశాడు.

దీనికి పూర్తిగా స్పందించిన సౌందర్య ఇలా ఉత్తరం వ్రాసి అందించింది.

ప్రియమైన హరి గార్కి! నీ యొక్క సౌందర్య వ్రాయునది. మిమ్మల్ని చూసిన మొదటి రోజే నన్ను మీరు ఆకర్షించారు.

పది సంవత్సరాల ప్రాయంలోనే జరిగిన ఒక ప్రమాదంలో ఒక కాలుపోయిన నాకు గల ఈ అవిటితనం విషయం తెల్సికూడా మీరు ప్రేమించటం వల్ల మీ ఉత్తరం కొరకు నాకు గల ఈ రెండు కళ్లను వెయ్యి చేసుకొని ఎదురు చూస్తుంటాను.

ఇంతే సంగతులు,
నీ సామ్రాజ్యరాణి, సౌందర్య.

ఈ ఉత్తరం చూసిన హరి ఒక్కసారి నిశ్చేష్టుడైనాడు. అసలు ఇది నిజమా, కాదా! అసలు అంతటి సౌందర్యరాశికి... ఆ...ఆ... మెకా... ఈ అవిటితనం! అనుకుంటూ, అతడికి జవాబు ఏమి రాయాలో అర్థం కాలేదు. ఇంతలో తన తండ్రికి వరంగల్‌కు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ రావడం, అదే సంవత్సరం అక్కడ వేరొక అమ్మాయితోనే వివాహం అవటం జరిగి పోయింది.

అయితే ఈ మధ్యే తన ఆఫీసులో కొత్తగా చేరిన 'అనిల్' మిగతా ఉద్యోగుల కంటే కొద్ది కాలంలోనే దగ్గరవటం, వారిరువురూ ప్రాణ మిత్రులు కావటం అంతా యాంత్రికంగా జరిగిపోయింది.

ఇక నిన్న సాయంత్రం అనిల్ తన మ్యారేజ్ డే సందర్భంగా తన ఇంటికి హరిని విందుకు ఆహ్వానించాడు. అతడి ఆహ్వానాన్ని స్వీకరించి, అతని ఇంటికి వెళ్ళి, ఒక్కసారి అనిల్ భార్యను చూసి ఆశ్చర్యపోయాడు. ఆమె... అందాల రాశి సౌందర్య! అవిడ కచ్చితంగా సౌందర్యే? ఇక ఆమె కాళ్ళు రెండూ ఆరోగ్యకరంగా ఉండటం చూసి హరి ఇంకా షాక్ తిన్నాడు. ఇక ఆమె మాత్రం గతంలో జరిగిన సంఘటన గుర్తు లేనట్లుగానే ప్రవర్తిస్తూ, సంతోషంగానే వడ్డించగా, హరి మాత్రం ఇంకా షాక్ నుండి తేరుకోకుండానే భోజనం అంతంత మాత్రంగానే పూర్తి చేసి ఆ దంపతుల నుండి సెలవు తీసుకొన్నాడు.

నిజానికి ఆనాడు ఆమెను గూర్చి ఏమీ తెల్సుకోకుండానే, కేవలం ఆమె ఉత్తరం వ్రాయగానే తన మదిలో నుండి ఆమెను దూరం చేసుకున్న అతడే నిజమైన అవిటివాడని అనుకుంటూ,

— జె. రాజేశ్వర్ రావు.